క్లుప్తంగా

ఇస్రో విజయం అందరిదీ

కైకలూరు: ఇస్రో సాధించిన చంద్రయాన్‌–3 విజయం భారతావని ప్రజలందరిది అని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ సాఫ్ట్‌గా ల్యాండింగ్ అవడం దేశ ప్రతిష్టను మరింతగా పెంచిందన్నారు. గాంధీ బొమ్మ, సంతమార్కెట్ సెంటర్ వద్ద ఏలూరు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కీర్తి వెంకట రామప్రసాద్ ఆధ్వర్యంలో ఇస్రో సాధించిన విజయానికి ప్రజలకు స్వీట్లు పంచారు. భారత జెండాతో ర్యాలీ చేశారు.

బీమా నగదు సాయం

కొండిపర్రు(పామర్రు): బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని కొండిపర్రు గ్రామంలో ఇటీవల మృతిచెందిన టి.ప్రసాద్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా సాయం కింద రూ.10 వేలను బుధవారం అందజేశారు. ఎంపీటీసీతలారి మహేష్, క్రాంతిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కళాజాతా

గుడివాడరూరల్: గ్రామ పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులపై అవగాహన కలిగి ఉండాలని కళాజాత సభ్యులు ఎం.శేఖర్‌బాబు అన్నారు. మండలంలోని చిరిచింతల, బొమ్ములూరు గ్రామాల్లో కళాజాత బృందం ఆధ్వర్యంలో బుధవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కళాజాత సభ్యులు ఎం.కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణిత అవధానం

గుడివాడ టౌన్: గణితశాస్త్రంపై అవగాహన పెంచుకుంటే దానిని అధ్యయనం చేయడం సులువని అమలాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో బుధవారం గణితశాస్త్ర విభాగం, డాక్టర్ ఎంజీ మాణిక్యాలరావు ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గణిత అవధానం నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం శివనాథ్, గణితశాస్త్ర విభాగాధిపతి కె.రమాదేవి, బీఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుడు మృతి

పామర్రు: స్థానిక మేజర్ పంచాయతీ 6వ వార్డు సభ్యుడు నవుడు శ్రీనివాసరావు (కిట్టు 54) బుధవారం సాయంత్రం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందారు. మృతునికి భార్య ఉంది. కిట్టు మృతి పట్ల సర్పంచ్ కె.కస్తూరి, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ సభ్యులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

తల్లీపిల్లకు సత్కారం

కూచిపూడి(మొవ్వ): రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత ప్రసూతి వైద్య సేవల్లో భాగంగా జన్మించిన నూరవ (100) చిన్నారిని, తల్లిదండ్రులను హాస్పటల్ యాజమాన్యం బుధవారం ఘనంగా సత్కరించింది. 2023 జనవరి 1న హాస్పటల్‌లో 365 మందికి ఉచితంగా ప్రసూతి సేవలు అందిచే క్రమంతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో 100వ చిన్నారి గురువారం జన్మించింది. దీంతో చిన్నారిని, తల్లి అలేఖ్యను సత్కరించారు. బెల్లంకొండ వెంకటేశ్వరరావు డాక్టర్‌లు నీలిమ, పృథ్వి గణేష్, కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కే రామాంజనేయులు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్‌ల సమావేశం

మండవల్లి: మండలంలోని వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లకు గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు కైకలూరు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్టు సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లంతా హాజరుకావాలని కోరారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- కృష్ణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

పమిడిముక్కల: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలో కృష్ణాపురం పంచాయతీ పరిధిలోని కొత్త ఎస్సీ కాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. తొలుత గ్రామంలోకి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కాలనీలో కొన్నేళ్ల కిందట రద్దైన పాఠశాలను ఎమ్మెల్యే అనిల్‌కుమార్, సర్పంచ్ బలుసలమ్మతో కలిసి ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందజేశారు. సమస్యలు తెలుసుకొని, ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే తగు



కొత్త ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత నాలుగేళ్లగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విపులంగా వివరించారు. అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కాలనీ వాసులు కోరగా, సమస్య పరిష్కారానికి చర్య తీసుకుంటానని తెలిపారు. కృష్ణాపురం ఎస్సీ కాలనీలో గత కొన్నేళ్లుగా మూతపడిన ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, సర్పంచ్ వీరంకి బలుసలమ్మ, వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, మండల సచివాలయాల కన్వీనర్ పరసా జగన్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, పార్టీ నాయకులు వీరంకి చిరంజీవి, యేనుగ మస్తాన్‌రావు, కాగిత శ్రీరామమూర్తి, యార్లగడ్డ శివ, కల్యాణ్, శ్యామ్, కార్యదర్శి విద్యాధర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు పెరటికోళ్ల పంపిణీ

పామర్రు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే సమాజం అభ్యున్నతి చెందుతుందని లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణి అన్నారు. పామర్రు సచివాలయం–1వద్ద 'మన కోడి' ప్రభుత్వ పథకంలో భాగంగా డ్వాక్రా సంఘ మహిళలకు పెరటికోళ్లను బుధవారం అందజేశారు. ఒక్కొక్క యూనిట్‌లో 8 పెట్టలు, 3 పుంజులు ఉంటాయి. యూనిట్ ధర రూ.7,500 కాగా ప్రభుత్వం రూ.3,530 లబ్సిడీ ఇవ్వగా రూ.3,970లకు అందజేశారు. మండల పరిధిలో 67 యూనిట్లను ఆయా డ్వాక్రా సంఘాల సభ్యులకు అందజేశారు. ఐకేపీ ఏపీఎం తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు తాడి



మహిళలకు పెరటి కోళ్లను అందజేస్తున్న ఎంపీపీ అశోక్, జెడ్పీటీసీ స్వరూపరాణి

శెట్టి శ్రీనివాసరావు, తలారి మహేష్, కాకుళ్ల రాజ్యలక్ష్మి, మండల పశుసంవర్ధక శాఖ అధికారి శశికుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనాల కృపావతి, పార్టీ నేతలు మురాల దామోదరరావు, జీ నరేష్, మహిళలు ఎస్‌రజని తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో అనగాని వెంకటరమణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ చౌటపల్లి సచివాలయం పరిధిలోని చౌటపల్లి, శేరీవేల్పూరు గ్రామాల్లో రెండు పోస్టులు, లింగవరం గ్రామంలో ఒకటి, మల్లాయపాలెం–1 సచివాలయం పరిధిలో ఒకటి, మల్లాయపాలెం–2 సచివాలయం పరిధిలోని ఒకటి, రామనపూడి సచివాలయం పరిధిలోని సీపూడి, తటివర్రు గ్రామాల్లో 2, వలివర్తిపాడు గ్రామంలో 2 వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

గుడివాడ టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న వార్డు వలంటీరు పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు వలంటీరు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. సమీపంలోని వార్డు సచివాలయంలో సమాచారం పొందవచ్చు.

తోట్లవల్లూరు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ తుంగల స్వర్ణలత తెలిపారు. తోట్లవల్లూరు (1), కనకవల్లి (1), ఐలూరు (1), దేవరపల్లి (1) వంతున ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ నెల 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని స్వర్ణలత సూచించారు.

పెదపారుపూడి: మండలంలోని మూడు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి బుధవారం తెలిపారు. యలమర్రు సచివాలయంలో –1, దోసపాడు–1, వెంట్రప్రగడ–2 సచివాలయం పరిధిలో 2 పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

శాస్త్రవేత్తలకు విద్యార్థుల జేజేలు

ముదినేపల్లి రూరల్ : చంద్రయాన్‌–3 విజయవంతం కావడంపై ఇస్రో శాస్త్రవేత్తలకు విద్యార్థులు జేజేలు పలికారు. చంద్రయాన్‌–3 వీక్షణ సన్నివేశాలను పలు పాఠశాలల్లో విద్యార్థులు బుధవారం తిలకించారు. ఇప్పటివరకు చందమామపై ఏ దేశం దిగని దక్షిణ ధృవంపై విక్రమ్ ల్యాండర్ కాలు మోపిన విధానాన్ని ఉపాధ్యాయులు వివరించారు.

ప్రాంతీయ కమిటీల ఏర్పాటు

ముదినేపల్లి రూరల్ : దక్షిణ భారత కాపు అసోసియేషన్ ప్రాంతీయ కమిటీల ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్టు కాపు అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పీవీఎస్ గోపాల్ తెలిపారు. ముదినేపల్లిలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అందరికీ సమన్యాయం చేయాలన్నదే అసోసియేషన్ ధ్యేయమన్నారు.గ్రామ,మండల, నియోజకవర్గ స్థాయిలో అసోసియేషన్ కమిటీలను ఏర్పాటుచేసి కాపు యువతకు స్వయం ఉపాధి పథకాల అమలు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందడం లాంటి అంశాలపై దృష్టిపెడతామన్నారు.

గుడివాడ, గన్నవరం నుంచి పోటీ చేసే దమ్ముందా?

పామర్రు: గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల నుంచి చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు పోటీ చేసే దమ్ముందా..? అని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పిటీసీ కె.స్వరూపరాణి ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేకే చంద్రబాబు, లోకేష్‌లు ప్రభుత్వంపై లేని పోని విమర్శలు చేస్తున్నారన్నారు. లోకేష్ పాదయాత్ర పామర్రు, గుడివాడ నియోజకవర్గాల్లో ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. పామర్రు నియోజకవర్గంలో లోకేష్ దత్తత తీసుకున్న నిమ్మకూరు, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి దత్తత తీసుకున్న కొమరవోలు గ్రామాలు ఉన్నాయని, ఆయా గ్రామాల్లో వారు చేసిన అభివృద్ధి ఏమిలేదని, ఈ విషయమై అక్కడి స్థానికులు ప్రశ్నిస్తారనే భయంతోనే పాదయాత్రను దారి మళ్లించారాని విమర్శించారు. ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు తలారి మహేష్, కాకోళ్ల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● సచివాలయ కన్వీనర్లకు జీవిత బీమా

కైకలూరు: సచివాలయ కన్వీనర్లకు ప్రభుత్వం జీవిత బీమా సౌకర్యం కల్పిస్తోందని నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కైకలూరు, కలిదిండి మండలాలకు చెందిన సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. శివరామకృష్ణ మాట్లాడుతూ వైనాట్ 175 అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధిలో సచివాలయ కన్వీనర్ల పాత్రఎంతో గొప్పదన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● రూ.7.26 లక్షల ఆదాయం

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 89 రోజులకు రూ.7,26,038 ఆదాయం హుండీ ద్వారా వచ్చినట్లు ఆలయ ఈవో ఎల్.సత్యవతి తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి వి.సుధాకర్ ఆధ్వర్యంలో ఈ లెక్కింపు జరిగిందన్నారు. దేవస్థాన కమిటీ చైర్మన్ మట్టా పూర్ణచంద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు, సేవా సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కంప్యూటర్ వితరణ

కైకలూరు(కలిదిండి): కలిదిండి పోలీసు స్టేషన్‌కు మాలమహానాడు విద్యా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల విజయ్‌కుమార్ రూ.16 వేల విలువ చేసే కంప్యూటర్‌ను బుధవారం అందించారు. ఈ సందర్భంగా సేవాగుణంతో కంప్యూటర్‌ను అందించిన విజయకుమార్‌ను ఎస్‌ఐ ప్రియకుమార్ అభినందించారు. కార్యక్రమంలో నాయకుడు ఎం.నెలబాలుడు, పోలీసు సిబ్బంది హాజరయ్యారు.

● నిత్యావసర సరుకుల పంపిణీ

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన గ్రామ ప్రజలకు నెస్టిల్ ఇండియా గ్రూప్, జేసీస్‌క్లబ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నూతులపాడు, వెన్ననపూడి గ్రామాలకు చెందిన 250 కుటుంబాలకు 11 రకాల వస్తువులు గల బాక్స్‌ను లబ్ధిదారులకు అందజేశారు. నెస్టిల్ ఇండియా కార్పొరేషన్ ఎఫైర్స్ మేనేజర్ వాసిం అహ్మద్, జేసీస్‌క్లబ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జీఎస్ఎన్ వర్మ, ఇండియా డైరెక్టర్ ఎన్‌బీ హర్షవర్ధన్‌రెడ్డి, గుడివాడ పూర్వ అధ్యక్షులు రూప్‌చంద్ జైన్, ఉరిటి రామారావు, సభ్యులు కిరణ్, హారిక, సంపత్, కోదండరామ్, లక్కి తదితరులు పాల్గొన్నారు.

● వాటర్ డిస్పెన్సర్ వితరణ

కూచిపూడి(మొవ్వ): మండలంలోని కూచిపూడిలోని రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో ఇటీవల ఏర్పాటుచేసిన డయాలసిస్ విభాగానికి రోటరీ సభ్యులు, రిటైర్డ్ హెచ్‌ఎం. కే నారాయణ మూర్తి రూ.10 వేల విలువైన ఓల్టాస్ వాటర్ డిస్పెన్సర్‌ను బుధవారం వితరణగా అందజేశారు. రోటరీ అధ్యక్షుడు కే రామాంజనేయులు, రోటరీ సభ్యులు కే మంజునాథ్, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, పాగోలు రమేష్ బాబు, పి గోపాలకృష్ణ, హాస్పటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

● సీనియర్ న్యాయవాది పాండురంగారావు మృతి

గుడివాడ టౌన్: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎస్‌వీ పాండురంగారావు (62) బుధవారం మృతి చెందారు. కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన పాండురంగారావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత 30 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న ఆయన మృతి పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాల సంఘం నాయకులు సంతాపం తెలిపారు.

● బాలుడి అదృశ్యంపై కేసు

పమిడిముక్కల: ఇంటి వద్ద ఆడుకొంటూ ఉన్న తన రెండేళ్ల బాలుడు కనగడటంలేదని కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన పేటేటి అనూష పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పేటేటి సోమేశ్వరరావు, అనూషల కుమారుడు ప్రిన్స్‌బాబు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో తల్లి అనూష బాలుడిని బయటకు రావొద్దని చెప్పి మంచినీరు తెచ్చేందుకు కుళాయి వద్దకు వెళ్లివచ్చే సరికి బాలుడు కనబడలేదు. అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యన్నారాయణ తెలిపారు. అనూష భర్తకు దూరంగా పుట్టింటివద్ద ఉంటోంది.

● ప్రజలు భాగస్వాములు కావాలి

ముదినేపల్లి రూరల్ : పోలీసు వ్యవస్థలో ప్రజలు భాగస్వాములైతే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఏలూరు డీఎస్పీ పి.శ్రీనివాసులు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్లో బుధవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ముదినేపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో నేరశాతం అతితక్కువగా ఉన్నట్టు చెప్పారు. వచ్చే నెలలో డీఐజీ స్టేషన్‌ను తనిఖీచేస్తారని తెలిపారు. ఏలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సై వెంకటకుమార్ పాల్గొన్నారు.

లోకేష్, టీడీపీ నేతలపై ఫిర్యాదు



గుడివాడరూరల్: గన్నవరం యువగళం యాత్రలో మంగళవారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో నారా లోకేష్, టీడీపీ నాయకులు చేసిన విమర్శలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి లోకేష్, టీడీపీ నాయకులపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శశి మాట్లాడుతూ ఎమ్మెల్యేలు కొడాలి నాని, వల్లభనేని వంశీలను చంపుతానని బెదిరించడమే కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. నారా లోకేష్, టీడీపీ నాయకులు అయ్యన్న పాత్రుడు, కొల్లు రవీంద్ర, బుద్దా వెంకన్న, యార్లగడ్డ వెంకట్రావ్‌లపై క్రిమినల్ కేసులు పెట్టి వెంటనే పోలీసులు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించడమే లక్ష్యంగా చంద్రబాబు, లోకేష్ వ్యవహరించడం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు సంయమనం పాటిస్తున్నారని అందరికీ తెలుసునన్నారు. చంద్రబాబు, లోకేష్‌లకు దమ్ము ధైర్యం ఉంటే గుడివాడ, గన్నవరంలో పోటీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి, వల్లూరిపల్లి సుధాకర్, మండలి హనుమంతరావు, మట్టా జాన్‌విక్టర్, నందివాడ మండల ఎంపీపీ పెయ్యల ఆదాం, మాదాసు వెంకటలక్ష్మి, చుండూరి శేఖర్, కే ఆంజనేయ ప్రసాద్, మూడెడ్ల ఉమాలు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి



గుడివాడలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు



జమీగొల్వేపల్లిలో టంగుటూరి చిత్రపం వద్ద నివాళులర్పిస్తున్న ఉషాదేవి తదితరులు

గుడివాడరూరల్: నేటి యువత టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ సాధనకు కృషి చేయాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, మండల పరిషత్ అధికారులు టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీవో అనగాని వెంకటరమణ, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

జమీగొల్వేపల్లి(పామర్రు): మండల పరిధిలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర తొలిముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం బి.గోపి, ప్రముఖ యోగ గురువు డి.ధర్మారావు, కొల్లి నాయుడమ్మ, గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్, గ్రంథాలయ పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యాలయం సూపరింటెండెంట్ వాణి, వీఆర్వో చాట్ల అజయ్ కుమార్ టంగుటూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీఆర్వోలు వెంకటాచారి, ఆనందరావు, కార్యాలయ సిబ్బంది హరీష్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పమిడిముక్కల: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిపారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ టంగుటూరి చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఏవో రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

గుడివాడ టౌన్: స్థానిక 23వ వార్డు సత్యన్నారాయణపురం చిన్న రామాలయం వీధిలో రూ.20 లక్షలు నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో ఈ నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో ఈ వార్డు కౌన్సిలర్‌గా ఉన్న టీడీపీ నాయకుడు వార్డు అభివృద్ధిపై ఏమాత్రం దృష్టిపెట్టలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి చింతల భాస్కరరావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ జిల్లా సుధారాణి, వార్డు ఇన్‌చార్జ్



భూమిపూజ చేస్తున్న గొర్ల శ్రీను

రఘుబాబు, మాజీ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సింగిరెడ్డి గగారిన్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండండి

కైకలూరు: విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ, చదువుపై శ్రద్ధ చూపాలని బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ చెప్పారు. మండల లీగల్‌సెల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జాగృతి హైస్కూల్లో న్యాయవిజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు వచ్చినప్పుడు మాత్రమే విద్యార్థులను పంపించాలని అన్నారు. బాలబాలికలకు ప్రత్యేక చట్టాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరైన బాలికలను వేదింపులకు గురిచేస్తే ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. బార్ అసోషియేషన్ జాయింట్ సెక్రెటరీ చావలి శంకర్ శాస్త్రి, మహిళా ప్రతినిధి ఎండీ రజీమున్నీసా, పెనల్ అడ్వకేట్ పిచ్చికల పవన్ కాంత్, న్యాయవాదులు వి.మమత, అలేఖ్య, మహిళా పోలీస్ ఆశా, ఎంఎల్ఎస్‌సీ కోఆర్డినేటర్ దుర్గాభవాని, పారా లీగల్ వలంటీర్స్ రాంబాబు, వేణు, స్కూల్ ప్రిన్సిపాల్ పాణెం జైకిషోర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

మొవ్వ: ఉన్నతాధికారులు హాజరు కాకుండా.. సమస్యలపై పూర్తి అవగాహన లేని అధికారులు హాజరు కావటం...గత సమావేశంలో సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు పరిష్కారం కాకపోవటంపై ఎంపీటీసీలు, సర్పంచ్‌ల అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మొవ్వ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారి హాజ రు కాకుండా కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రావటంపై అసహనం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి, తమకు చెడ్డ పేరు వస్తుందటూ సర్పంచ్‌లు నాగనబోయన సునీల్, వేములమడ సీతారామయ్య, తూము పూర్ణచంద్రరావు, కాకుమాని శ్రీలక్ష్మి,ఉప్పలపాటి జ్యోతి, ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు తీసుకువచ్చిన ప్రతి అంశాన్ని అధికారులు నోట్ చేసుకుని..వాటి పురోగతిని తరువాతి సమావేశంలో తెలపాలన్నారు. జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, వేమూరి పరిశుద్ధరాజు, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్ పాల్గొన్నారు.

